




# కరపత్రం

SINCE 2014

శుక్రవారం ఆగస్ట్ 22 2025 సంపుటి :0 సంచిక :307 - శివప్రసాద్, మేనేజింగ్ ఎడిటర్ పేజీలు :4





- రాబోయే మేడారం మహా జాతరకు రూ.150 కోట్ల కేటాయింపు
- వీటిలో ఐదు కీలక శాఖలకు రూ.90.87 కోట్ల నిధులు
- ఈ సారి ఐదు నెలల ముందే నిధులు విడుదల
- పారదర్శకంగా, శాశ్వత, నాణ్యతతో పనులు చేపట్టేందుకు అవకాశం
- 2024 జాతరకంటే రూ.45 కోట్లు నిధులు అదనం
- జనవరి 28నుంచి 31వ తేదీ వరకు జరగనున్న మహాజాతర
- కోటిన్నర మందికి పైగా భక్తులు వస్తారని అంచనా

వరంగల్ : తెలంగాణ కుంభమేళాగా పేరుగాంచిన మేడారం సమ్మక్క, సారలమ్మ మహా జాతరకు ప్రభుత్వం రూ. 150కోట్ల నిధులను కేటాయించింది. వీటిలో కీలకమైన పంచాయతీరాజ్, ఆర్అండ్బీ, ఇరిగేషన్, గిరిజన సంక్షేమశాఖ, ఆర్డబ్ల్యుఎస(పారిశుధ్యం) శాఖలకే రూ. 90. 87కోట్ల నిధులు కేటాయించారు. వచ్చే ఏడాది జనవరి 28వ తేదీ నుంచి నాలుగురోజుల పాటు జరిగే మహాజాతరకు కోటిన్నర మందికి పైగా భక్తులు పాల్గొంటారనే అంచనాలతో ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తోంది. జాతరకు వచ్చే భక్తులకు మెరుగైన వసతులు, సౌకర్యాలు కల్పించటంతో పాటు ప్రశాంతంగా తల్లులను దర్శించుకునేలా ఏర్పాట్లు చేసేందుకు ప్రభుత్వం భారీగా నిధులు కేటాయింపులు చేసింది. ఐదు నెలల ముందే నిధులు విడుదల కావటంతో నాణ్యతతో పనులు నిర్వహించేలా అధికారయంత్రాంగం దృష్టి పెట్టే అవకాశం ఉంది. పదేళ్ల తరువాత భారీ మొత్తంలో నిధులు కేటాయింపులు చేయటంతో హర్షం వ్యక్తం అవుతోంది. పేజి 2లో ▶

# ఉప రాష్ట్రపతి పదవికి జస్టిస్ బి.సుదర్శన్‌రెడ్డి నామినేషన్ దాఖలు



2లో..

- తెలంగాణ రైతులకు ఎరువులు సరఫరా చేయాల్సిన బాధ్యత కేంద్ర ప్రభుత్వానిదేనని మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు.
- రాష్ట్రం నుంచి ఇద్దరు కేంద్ర మంత్రులు ఉన్నప్పటికీ, ఎరువుల సమస్యను పట్టించుకోవడం లేదని విమర్శించారు.
- కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గం నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న కేంద్రమంత్రి బండి సంజయ్, రైతులు చేస్తున్న ధర్నాలకు జవాబు చెప్పాలని డిమాండ్ చేశారు.
- కేంద్రం నుంచి రావాల్సిన ఎరువుల్లో కేవలం 60% మాత్రమే వచ్చాయని, అందుకే రైతులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు.

## పర్యాటక శాఖతో కలిసి జంపన్నవాగు అభివృద్ధి: మంత్రి సీతక్క

హైదరాబాద్: సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశాలతో మేడారం జాతరకు వసతులు కల్పిస్తున్నామని మంత్రి సీతక్క పేర్కొన్నారు. పర్యాటకశాఖతో కలిసి జంపన్న వాగును అభివృద్ధి చేస్తామన్నారు. స్మృతి వనాన్ని 29 ఎకరాల్లో ప్రత్యేకంగా అభివృద్ధి చేస్తామని చెప్పారు. సచివాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడారు. "ఆదివాసీ పూజారులతో కలిసి స్మృతివనాన్ని అభివృద్ధి చేయాలని సీఎం ఆదేశించారు. నిధులు మంజూరు చేసినందుకు సీఎం, డిప్యూటీ సీఎంకు ప్రత్యేకంగా ధన్యవాదాలు.



తెలుగు ప్రజల గొప్ప జాతర సమ్మక్క సారలమ్మ జాతర. ప్రజలు ఎలాంటి అసౌకర్యానికి గురికాకుండా ప్రభుత్వం రూ. 150 కోట్లు మంజూరు చేసింది." అని సీతక్క తెలిపారు.



### నాగార్జునసాగర్ జలాశయానికి భారీగా వరద ప్రవాహం..

# 26 గేట్లు ఎత్తి నీటి విడుదల

నాగార్జునసాగర్ జలాశయానికి భారీగా వరద ప్రవాహం వచ్చి చేరుతోంది. దీంతో 26 గేట్లు ఎత్తి నీటిని విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టుకు ఇన్‌ఫ్లో 3,92,997 క్యూసెక్కులు కాగా.. ఔట్‌ఫ్లో 4,73,053 క్యూసెక్కులుగా ఉంది. నాగార్జునసాగర్ పూర్తిస్థాయి నీటిమట్టం 590 అడుగులు కాగా.. ప్రస్తుత నీటిమట్టం 583 అడుగులుగా ఉంది. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటినిల్వ 312.04 టీఎంసీలు కాగా.. ప్రస్తుతం 291.66 టీఎంసీలుగా నమోదైంది. 2లో



## జస్టిస్ ఘోష్ కమిషన్ నివేదిక ఆధారంగా చర్యలు తీసుకుంటారా?: హైకోర్టు



2లో ▶

## లోక్‌సభలో పెట్టిన బిల్లుతో దోచుకున్నవారికి బాధ కలుగుతోంది:



2లో ▶

- రాజకీయాల్లో అవినీతి ఆరోపణలు వచ్చినప్పుడు, ముఖ్యంగా జైలుకు వెళ్లినప్పుడు స్వచ్ఛందంగా పదవి నుంచి వైదొలగాలని కిషన్ రెడ్డి అన్నారు.
- ఢిల్లీ మద్యం కుంభకోణంలో జైలులో ఉన్నప్పటికీ, ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ జైలు నుంచే పాలన చేశారని విమర్శించారు.
- తమిళనాడు మంత్రి సెంథిల్ బాలాజీ జైలుకు వెళ్లినా రాజీనామా చేయలేదని పేర్కొన్నారు.
- ప్రభుత్వాలను కాపాడాలనుకునే నాయకులకు, పార్టీలకు నైతిక విలువలు అవసరమని తెలిపారు.

# కుట్రలకు పాల్పడే వారిని బయటపెట్టాలని కోరితే..


## నాపైనే కక్షకట్టారు: ఎమ్మెల్సీ కవిత

హైదరాబాద్: సింగరేణి బొగ్గు గని కార్మికులకు భారత రాష్ట్ర సమితి ఎమ్మెల్సీ కవిత బహిరంగ లేఖ రాశారు. టీవీజీకేఎస్ గౌరవ అధ్యక్షుడిగా ఎన్నికైన కొప్పుల ఈశ్వర్‌కు శుభాకాంక్షలు తెలిపారు. కార్మికుల చట్టాలకు విరుద్ధంగా పార్టీ కార్యాలయంలో ఎన్నిక నిర్వహించారన్నారు.

" రాజకీయ కారణాలతోనే ఈ ఎన్నిక జరిగింది. సింగరేణి కార్మికుల కోసం పోరాడుతుంటే నాపై కుట్ర పన్నుతున్నారు. భారత రాష్ట్ర సమితిలో జరుగుతున్న పరిణామాలు అందరికీ తెలుసు. నా తండ్రికి రాసిన లేఖను నేను అమెరికా వెళ్లినప్పుడు లీక్ చేశారు. నాపై కుట్రలకు పాల్పడుతున్న వారిని బయటపెట్టాలని కోరితే.. నాపైనే కక్షకట్టారు. ఆ కుట్రదారులే నన్ను వివిధ రూపాల్లో వేధింపులకు గురి చేస్తున్నారు. నేను అమెరికాలో ఉన్న సమయంలోనే గౌరవ అధ్యక్ష ఎన్నిక జరిగింది. చట్టవిరుద్ధంగా టీవీజీకేఎస్ సమావేశం నిర్వహించి ఎన్నుకున్నారు" అని కవిత తెలిపారు.




## రాచకొండ సీపీ ఎదుట లొంగిపోయిన సెంట్రల్ కమిటీ మావోయిస్టు సభ్యులు



హైదరాబాద్: రాచకొండ సీపీ సుధీర్‌బాబు ఎదుట ఇద్దరు సెంట్రల్ కమిటీ మావోయిస్టు సభ్యులు లొంగిపోయారు. మావోయిస్టు సీనియర్ స్టేట్ కమిటీ సభ్యురాలు కాకరాల సునీత సీపీ ఎదుట లొంగిపోయారు. ఆమె తండ్రి, ఒక విప్లవ రచయితల సంఘం నాయకుడిగా పని చేసినట్లు పోలీసులు గుర్తించారు. ఇందుకు సంబంధించిన వివరాలును సీపీ వెల్లడించారు.

## 81 ఏళ్ల వృద్ధుడిపై హనీట్రాప్.. లక్షలు కాజేసిన సైబర్ నేరగాళ్లు



2లో ▶

# సంపాదకీయం

## సర్ సమస్యకు తప్పుడు పరిష్కారం

ఓటర్ జాబితాలలోని సమస్యలకు ప్రత్యేక సమగ్ర సవరణే (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ %-ఎస్ఐఆర్) పరిష్కారమని భారత ఎన్నికల సంఘం ప్రధానాధికారి (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్ పునరుద్ఘాటించారు. ఇది పాత వాదనే. అయితే బెంగళూరులోని మహదేవపుర అసెంబ్లీ నియోజకవర్గ ఓటర్ల జాబితాలో మోసాలను రాహుల్‌గాంధీ బహిర్గతం చేసిన తరువాత ప్రత్యేక సమగ్ర సవరణే నిశ్చితమైన పరిష్కారమని సీఈసీ మరింతగా నొక్కి చెప్పారు. ప్రతిపక్ష నాయకుడు వలలో పడ్డాడని బీజేపీ సామాజిక మాధ్యమాల గణాలు భావించాయి. ఓటర్ జాబితాలలోని లొసుగుల గురించి ఆయనెలా ఫిర్యాదు చేస్తున్నారు? వాటన్నిటినీ ప్రక్షాళన చేసేందుకే చేపట్టిన ప్రత్యేక సమగ్ర సవరణకు ప్రతిపక్షనేత ఎందుకు మద్దతునివ్వడం లేదు? ఇత్యాది ప్రశ్నలు గుప్పించాయి. సీఈసీ సైతం ఇదే ఆలోచనాసరళిని అనుసరించారు. మూడు రోజుల క్రితం విలేఖర్ల సమావేశంలో ఆయన మాట్లాడిన తీరు ఆ విషయాన్ని స్పష్టం చేసింది.సీఈసీ జ్ఞానేశ్ కుమార్ బహుశా, 'యస్ మినిస్టర్'ను చూసి ఉండకపోవచ్చు. ఆ సుప్రసిద్ధ రాజకీయ వ్యంగ్య ధారావాహిక ఆ అప్రమాణిక ఆలోచనా సరళిని 'రాజకీయవేత్త తర్క పద్ధతి' అని అభివర్ణించింది. అదిలా ఉంటుంది. 'మనం ఏదో ఒకటి చేయాలిబీ ఆ నిర్దిష్ట పని ఇదేబీ కనుక మనం దాన్ని చేయాలి'. ఒక మౌలిక ప్రశ్నను అడగకపోవడమే ఈ ఆలోచనా సరళిలోని తార్కిక దోషం: మనం చేయవలసిన ఆ 'ఏదో ఒకటి', మనం చేయవలసిన 'నిర్దిష్ట పని'గా మనకు సూచించినదేనా? రాహుల్‌గాంధీని అపహసిస్తున్నవారు సరిగ్గా అడగని ప్రశ్న ఇదే: మనం చేయవలసిన పని 'ప్రత్యేక సమగ్ర సవరణ' ఓటర్ జాబితాలలోని లొసుగులు, మోసాలు, తప్పులను తొలగించేందుకు చేపట్టవలసిన 'నిర్దిష్ట చర్యేనా?' సమాధానమేమిటి? ఇదీ అని భావిస్తే సరిపోదు. మన ఓటర్ జాబితాలలోని సమస్యలకు ప్రత్యేక సమగ్ర సవరణ తప్పనిసరి, తగిన ఫలితాలనిచ్చే సరైన పరిష్కారమనే నమ్మకం దురదృష్టవశాత్తు ఎవరికీ కలగడం లేదు. అయినా సీఈసీ వాదనను, దానిలో తర్క బద్ధత ఉందని భావించి, నిశితంగా పరీక్షిద్దాం.మన ఓటర్ జాబితాలలో తీవ్ర లోపాలు ఉన్నాయని అంగీకరిస్తూ మన తార్కిక విమర్శను ప్రారంభిద్దాం. ఓటర్ జాబితాల 'సమగ్రత' విషయంలో భారత ఎన్నికల వ్యవస్థ ప్రశస్తంగా ఉందనడంలో సందేహం లేదు. అయితే ఆ జాబితాల 'కచ్చితత్వం' లేదా 'నిర్దుష్టత' ఉండవలసిన రీతిలో లేదనేది ఒక వాస్తవం. ఇదేమీ కొత్త సమస్యకాదు. ముఖ్యంగా పట్టణ ప్రాంతాల ఓటర్ జాబితాలలో కచ్చితత్వం ఉండవలసిన రీతిలో ఉండడం లేదు. ఆ జాబితాలలో మార్పులు, చేర్పుల విషయమై ఆరోపణలు పెద్దగా లేకపోవడం వల్ల వాటిలో కచ్చితత్వం తక్కువగా ఉందన్న వాస్తవం ప్రజల దృష్టికి రాలేదు. మహారాష్ట్ర, మహదేవపురలో ఓటర్ జాబితాలలోని మోసాలను బహిర్గతం చేసిన తరువాత ఆ తీవ్ర లోపం దేశవ్యాప్తంగా ప్రజల దృష్టికి వచ్చింది.

ఓటర్ జాబితాలలో లొసుగులు, లోపాలు తొలగించేందుకు ఎన్నికల సంఘం గత కొద్ది సంవత్సరాలుగా చేసిన ప్రయత్నాలు ఫలించలేదన్న సీఈసీ వాదనను కూడా అంగీకరిద్దాం. యథాలాపంగాచేసే ఓటర్ జాబితాల సవరణ పరిష్కారం కాదు, కాబోదు. ఎందుకని? పౌరబాధ్యతల స్పృహ ఉన్నవారు తమ పేర్ల చేర్పుకు లేదా తీసివేతకు లేదా దిద్దుబాటుకు, నివాస ప్రదేశాల మార్పు గురించి తెలియజేయడానికి నివేదించిన అభ్యర్థనలకే ఈ సవరణ ప్రక్రియ పరిమితమవుతుంది. వార్షిక సంగ్రహ సవరణ మెరుగైనది. భారీ సంఖ్యలో చేర్పులు, తీసివేతలను సమగ్రంగా సమీక్షించేందుకు ఈ ప్రక్రియలో అవకాశమున్నది.. అయినా ఇది కూడా సంతృప్తికరమైన పరిష్కారం కాదు. ఎందుకని? ఈ సంగ్రహ సవరణ సమయంలో బీఎల్ఓ (పోలింగ్ బూత్ స్థాయి అధికారి) ప్రతి ఇంటికి వెళ్లి యథార్థాలు తెలుసుకోవలసిన అవసరముండదు. ఏమైనా ప్రస్తుత విధానంలో సంవత్సరాలుగా అనేక లొసుగులు లోపాలు కొనసాగుతున్నాయి.ఈ వాస్తవాల దృష్ట్యా పరిస్థితులను చక్కదిద్దేందుకు ఒక నిర్దిష్ట చర్య చేపట్ట వలసిన అవసరమున్నది. ఆ నిర్దిష్ట చర్య మరింత సమగ్రంగా, క్రమబద్ధంగా ఉండాలి. అదే సమయంలో అది మరింత పారదర్శకంగా, న్యాయబద్ధంగా కూడా ఉండితీరాలి. సాధారణ సవరణలు, వార్షిక సంగ్రహ సవరణలతో పాటు ప్రతి ఐదు సంవత్సరాలకొకసారి ప్రత్యేక సమగ్ర సవరణ చేపట్టవలసిన అవసరమున్నది. ఈ ప్రత్యేక సమగ్ర సవరణలో ప్రతి ఇంటికి వెళ్లి ఓటర్ల వివరాలు సేకరించాలి. కొత్త ఓటర్లను నమోదు చేయాలి. మృతులు, ఇతర ప్రదేశాలకు వెళ్లిపోయిన వారి పేర్లను తొలగించాలి. ఇలా ఓటర్ జాబితాలను సవరించవలసి ఉన్నది. ఇదంతా ప్రామాణిక పద్ధతులలో జరగాలి. మరి బిహార్‌లో ఎన్నికల సంఘం చేపట్టిన ప్రత్యేక సమగ్ర సవరణ ఈ బాధ్యతలనే నిర్వర్తిస్తున్నది కదా అని ఆ ప్రక్రియను సమర్థిస్తున్నవారు తప్పక ప్రశ్నిస్తారు. నేను వారితో ఏకీభవించడం లేదు. వాస్తవమేమటంటే ఎన్నికల సంఘం బిహార్‌లో చేపట్టిన ప్రత్యేక సమగ్ర సవరణకు మనకు అవసరమైనదీ, మన ఎన్నికల చట్టాలను రూపొందించినవారు ఉద్దేశించిందీ కాదు. ఈ 'ప్రత్యేక' సమగ్ర సవరణ తప్పనిసరైనదీ కాదు, ఓటర్ జాబితాలకు సంబంధించిన సమస్యలను పరిష్కరించేందుకు సరిపోయేదీ కాదు. అనవసరంగా స్టెరాయిడ్లు, ప్రమాదకరమైన పదార్థాలు కలిసిన ఔషధమది. మనం ఎదుర్కొంటున్న సమస్యకు ఆ 'సర్' పరిష్కారం కాదు. అది సమస్యను మరింత తీవ్రం చేస్తుంది. ఇప్పటికే చేసింది కూడా. బిహార్ 'సర్' ఎన్నికల చట్టం ఉద్దేశ్యంతో గానీ, ప్రత్యేక సవరణ స్ఫూర్తితో గానీ ముడివడి ఉన్న ప్రక్రియ కాదు. ఈ విషయాలను మరింత వివరంగా పరిశీలిద్దాం.బిహార్‌లో చేపట్టిన ఓటర్ జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ (సర్) ప్రకారం సంభావ్య ఓటర్లు అందరూ ఎన్యూమరేషన్ పత్రాలను పూర్తిచేసి ఇవ్వాలి. ఇవ్వనిపక్షంలో తమంతట తామే ఓటరుగా నమోదు అయ్యేందుకు అనర్హులవుతారు. భారతదేశ ఎన్నికల చరిత్రలో ఇంతకు ముందెన్నడూ లేని నిబంధన ఇది. దీనికి ఏ విధమైన చట్ట ప్రాతిపదిక లేదు. చాలా చిన్న విషయంగా కనిపిస్తున్నా వాస్తవానికి మన ఎన్నికల వ్యవస్థలో ఒక మౌలిక మార్పు అని చెప్పి తీరాలి. గతంలో ఓటర్ల నమోదుకు ప్రభుత్వమే చొరవ చూపేది. ఇప్పుడు ఓటరుగా నమోదు కాదలుచుకున్న వారే అందుకు సొంతంగా శ్రద్ధ చూపాలి. అంటే వయోజనులను ఓటరుగా నమోదు చేసే బాధ్యత ఎన్నికల అధికారులకు ఉండదు. ప్రత్యేక సమగ్ర సవరణ ఆ బాధ్యతను ఓటర్ల పైనే మోపింది. ఓటర్ల నమోదులో ఇటువంటి మార్పు పర్యవసానాలు ఎలా ఉంటాయి? పేద ప్రజలు, అవిద్యావంతులు, వలస జీవులు, మైనారిటీలు, మహిళలు ఓటర్లుగా నమోదు కావడం గణనీయంగా తగ్గిపోతుందనేది పలు దేశాల అనుభవాలు స్పష్టం చేస్తున్నాయి.ప్రతి ఒక్క సంభావ్య ఓటర్ కూడా ఓటరుగా నమోదయ్యేందుకు తన అర్హతను నిరూపించుకునేందుకై వివిధ ధ్రువీకరణ పత్రాలు సమర్పించి తీరాలి. ఓటర్‌గా నమోదయేందుకు పలు డాక్యుమెంట్లను విధిగా సమర్పించవలసిరావడమనేది ఇంతకు ముందెన్నడూ జరగలేదు. ఈ కొత్త నిబంధనకు చట్టబద్ధమైన ఆధారమేమీ లేదు. అంతేకాదు పౌరసత్వ భావనను వ్యతిరేకిస్తుంది. ప్రత్యేక సమగ్ర సవరణ ప్రకారం ఓటరుగా నమోదుకాగోరువారు తమ తల్లిదండ్రుల పౌరసత్వాన్ని నిరూపించే పత్రాలు సమర్పించాలి. ఇది పౌరసత్వ భావనను తారు మారు చేస్తుంది. తన పౌరసత్వాన్ని రుజువు చేసుకునే బాధ్యతను ఓటర్‌పైనే మోపుతుంది. ఈ అసంబద్ధతల సంచిత ప్రభావం సామూహికంగా ఓటుహక్కు తొలగింపు అనడంలో సందేహం లేదు. ఎన్నికల సంఘం నిర్దేశించిన అసంబద్ధ నిబంధనల వల్ల చాలామంది తమ ఓటుహక్కును కోల్పోతారు. బిహార్‌లో 'సర్' సాధిస్తుంది ఇదే కాదూ? ప్రత్యేక సమగ్ర సవరణ విధిగా ఓటర్ జాబితాల కచ్చితత్వాన్ని మెరుగుపరిచి తీరాలి. కానీ అలా జరగడం లేదు. ఈ బాధ్యతపై అసలు శ్రద్ధ పెట్టడం లేదని కూడా చెప్పాలి. ప్రతి ఇంటికీ వెళ్లి నిర్వహించే ఎన్యూమరేషన్‌లో తొలగింపులకు ఇచ్చే ప్రాధాన్యాన్ని అదనపు చేర్పులకు కూడా ఇవ్వాలి. బిహార్‌లో ఇలా జరగలేదు. జూన్ 25- జూలై 25 మధ్య నిర్వహించిన ఎన్యూమరేషన్‌లో 65 లక్షల మందికి పైగా ఓటర్ల పేర్లను ఓటర్ జాబితాల నుంచి తొలగించారు. అయితే అదనంగా ఒక్క పేరును కూడా ఆ జాబితాలలో చేర్చలేదు. నిజంగా ఇది సమగ్ర సవరణ కానేకాదు. అది సమగ్ర తొలగింపు ప్రక్రియ. ఇదొక నిష్ఠుర సత్యం.ఓటర్ జాబితాల నుంచి నిర్దిష్ట ఓటర్ల పేర్లు తొలగించే ముందు వారు 'మృతులు', 'ఇతర ప్రదేశాలకు శాశ్వతంగా వెళ్లిపోయినవారు', 'జాడ తెలియడం లేదు' అని నమోదు చేసేముందు ఎన్నికల సంఘం నెలకొల్పిన సవివరమైన మార్గదర్శకాలను అనుసరించి ఉండవల్సింది. ఈ ప్రకారం ప్రామాణిక చట్టబద్ధ ప్రక్రియ (నోటీస్, విచారణ, అప్పీల్)ను అనుసరించి ఉన్నట్టయితే చాలా మంది 'మృత' ఓటర్ల ఫిర్యాదులకు గురికావల్సిన ఇబ్బంది ఎన్నికల సంఘంకు ఇప్పుడు ఉండేదికాదు.

## 81 ఏళ్ల వృద్ధుడిపై హనీట్రాప్..
## లక్షలు కాజేసిన సైబర్ నేరగాళు

మొదటిపేజీ తరువాయి

హైదరాబాద్: సైబర్ నేరగాళ్ల పంజాకు హైదరాబాద్‌కు చెందిన ఓ వృద్ధుడు చిక్కాడు. అతడి నుంచి రూ. 7.11 లక్షలను కేటుగాళ్లు కాజేశారు. నగరంలోని అమీర్‌పేట్‌కు చెందిన 81 ఏళ్ల వృద్ధుడిని సైబర్ నేరగాళ్లు మోసగించారు. ఆయనతో చనువుగా మాట్లాడుతూ సొమ్మున తస్కరించారు. ఇంకా డబ్బులు అడగటంతో అనుమానం వచ్చిన వృద్ధుడు వెంటనే సైబర్ క్రైమ్ పోలీసులను ఆశ్రయించాడు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

## భావజాల శత్రువు భాజపా.. రాజకీయ విరోధి డీఎంకే: నటుడు విజయ్



తమ భావజాల శత్రువు భాజపా .. రాజకీయ విరోధి డీఎంకే అని టీవీకే అధ్యక్షుడు, నటుడు విజయ్ పేర్కొన్నారు. వచ్చే తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో డీఎంకేకు, తమ పార్టీ కి మధ్యే ప్రధాన పోటీ ఉంటుందన్నారు. రాష్ట్రంలో ప్రతి ఇంటి తలుపును తడతామన్నారు. అసెంబ్లీ ఎన్నికల సన్నాహాలను ఉధృతం చేసిన ఆయన.. మదురైలో నిర్వహించిన భారీ బహిరంగ సభలో ఈమేరకు ప్రసంగించారు. తనను ఎంత విమర్శిస్తే అంత ఎదుగుతానని వ్యాఖ్యానించారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో విప్లవం సృష్టిస్తామన్నారు. తాను మధురై ఈస్ట్ నుంచి పోటీ చేస్తున్నట్లు ప్రకటించారు.

"కులం కాదు.. మతం కాదు.. తమిళుడికే ప్రాధాన్యం ఇస్తాం. భాజపాతో చేతులు కలిపే ప్రసక్తే లేదు. మనుగడ కోసమే ఇతర పార్టీలు పొత్తు పెట్టుకుంటున్నాయి. ఆరెస్సెస్ ముందు మనం ఎందుకు తలవంచాలి? తమిళ అస్తిత్వాన్ని ప్రతిపక్షాలు తగ్గిస్తున్నాయి. కచ్చతీవులకు శ్రీలంక నుంచి స్వేచ్ఛ కల్పిస్తాం. రాష్ట్ర సీఎం ఎంకే స్టాలిన్ దిల్లీలో రహస్య సమావేశాలు జరుపుతున్నారు. ఆయన పాలనలో మహిళలకు రక్షణ లేకుండా పోయింది" అని విజయ్ విమర్శలు గుప్పించారు. 2024 ఫిబ్రవరిలో టీవీకేను స్థాపించినప్పటినుంచి భారీ సభను నిర్వహించడం ఇది రెండోసారి. గతేడాది విల్లుపురం జిల్లాలోని విక్రవందిలో తొలి సభ నిర్వహించారు.

# నిధుల వరద

మొదటిపేజీ తరువాయి

### రూ.150 కోట్లు కేటాయింపు...

మేడారం మహాజాతరకు ప్రభుత్వం రూ.150కోట్ల నిధులను విడుదల చేస్తూ బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. వచ్చే ఏడాది జనవరి 28వ తేదీ నుంచి 31వ తేదీ వరకు నాలుగు రోజుల పా టు మహాజాతరను నిర్వహించనున్నా రు. తెలుగు రాష్ట్రాలతో పాటు చత్తీసగడ్, ఒరిస్సా, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్‌తో పాటు దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి భక్తులు ప్రకృతి దైవాలైన సమ్మక్క, సారలమ్మలను దర్శించుకునేందుకు రానున్నారు. 2026 మహాజాతరకు సుమారు కోటిన్నర మందికి పై గా భక్తులు పాల్గొంటారనే అంచనాలతో శాశ్వత నిర్మాణాలతో పాటు రహదారులు, తాగునీటి సదుపాయాలు, విద్యుత్, పారిశుధ్యం, మరుగుదొడ్ల నిర్మాణం తదితర అభివృద్ధికి పనులకు ప్రభుత్వం నిధుల కేటాయింపులు చేసింది. వీటిలో మంత్రి సీతక్క ప్రాతినిధ్యం వహిస్తున్న పంచాయతీరాజ్‌శాఖకు అత్యధికంగా రూ.51.30కోట్ల నిధులు కేటాయించారు. ఆర్అండ్‌బీ శాఖకు రూ.9.95కోట్లు, నీటిపారుదలశాఖకు రూ.5.90కోట్లు, గిరిజన సంక్షేమశాఖ(ఇంజనీరింగ్ విభాగం)కు రూ.8.57కోట్లు, ఆర్‌డబ్ల్యుఎస్, పారిశుధ్యం కోసం రూ.15.15కోట్ల నిధులు కేటాయించారు. వివిధ అభివృద్ధి పనులకే రూ.90.87కోట్లు కేటాయించారు. అలాగే మిగతా 15శాఖలకు 59.13కోట్లు కేటాయించారు. ఇందులో ప్రధానంగా జిల్లా పంచాయతీ అధికారికి రూ.11.62కోట్లు అత్యధికంగా కేటాయించగా, పోలీసశాఖకు రూ.14.50కోట్లు, రెవెన్యూశాఖకు రూ.14.38కోట్లు, దేవాదాయశాఖకు రూ.1.75కోట్లు కేటాయించారు. కాగా, జాతరలో ఈసారి భక్తులు అసౌకర్యాలు కలుగకుండా ఏర్పాట్లు చేయాలని అధికారులు కసరత్తు చేస్తున్నారు. గత జాతర కంటే మరింత విస్తృతంగా, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకుని ఏర్పాట్లు చేయాలని ప్రభుత్వం ఆదేశించింది. భారీగా సీసీ కెమెరాలు, డ్రోన్ల ద్వారా నిఘా ఏర్పాటు చేయనున్నారు. అత్యవసర వైద్య సేవ కేంద్రాలు, ప్రత్యేకంగా కంట్రోల్ రూమ్‌లు, ఉచిత బస్సులు సంఖ్య పెంచటం, తాత్కాలిక వసతి గృహాలను ఏర్పాటు చేయటం వంటి అదనపు సౌకర్యాలు కల్పించేలా అధికారులు దృష్టి పెట్టారు. మొత్తంగా రికార్డు స్థాయిలో మేడారం జాతరకు ఈసారి రూ.150కోట్ల నిధులను ప్రభుత్వం కేటాయించింది. తెలంగాణ ఏర్పడిన తరువాత తొలిసారిగా 2016లో జరిగిన మేడారం మహాజాతరకు అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం రూ.150.50కోట్లు కేటాయించింది.

### మహాజాతరకు భారీ నజరానా

కాంగ్రెస్ ప్రభుత్వం మేడారం మహాజాతరపై ప్రత్యేక దృష్టి పెట్టింది. సీఎం రేవంత్‌రెడ్డికి సమ్మక్క, సారలమ్మల సెంటిమెంట్ ఉండటంతో మహాజాతర అభివృద్ధికి పెద్దపీట వేస్తున్నారు. 2023 ఫిబ్రవరి 6వ తేదీన హత్ సే హత్ జోడో యాత్రను రేవంత్‌రెడ్డి మేడారం నుంచే ప్రారంభించి సక్సెస్ అయ్యారు. అదే సెంటిమెంట్‌తో తల్లుల జాతర అభివృద్ధికి పెద్ద పీట వేస్తున్నారనే వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి.

2024లో ఫిబ్రవరిలో జరిగిన మహాజాతరకు రెండు నెలల సమయమే ఉన్నప్పటికీ రూ.105కోట్లు ఇవ్వగా, తాజాగా ఐదు నెలల ముందే మహాజాతర కోసం రూ.150కోట్లు కేటాయించారు. ప్రధానంగా తెలంగాణ ఏర్పడిన తరువాత మేడారం జాతర అభివృద్ధికి పాలకులు ప్రత్యేకంగా దృష్టిసారించారు. 2014, జూన్ 2న స్వరాష్ట్రం సిద్ధించినప్పటి, తొలి జాతరను మాత్రం 2016 ఫిబ్రవరిలో తెలంగాణ ప్రభుత్వం నిర్వహించింది. 2016లో భారీ స్థాయిలో మేడారం జాతరకు రూ.150.50కోట్లు కేటాయించింది. స్వరాష్ట్రంలో భారీగా నిధులు కేటాయించి, గిరిజన జాతర వైభవాన్ని విశ్వవ్యాప్తం చేయాలని సంకల్పించింది. దీంతో మేడారం భక్తుల్లో ఆనందం వ్యక్తమైంది. అయితే 2018 జాతర కోసం అధికారులు రూ.175కోట్లతో మొదటి ప్రతిపాదనలు పంపించారు. కానీ, రూ.85.55కోట్లు మాత్రమే అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం కేటాయించింది. దీంతో రెండేళ్లకే మేడారం జాతరకు రూ.69.95కోట్ల కోత పడింది. ఆ తరువాత 2020లో జరిగిన మేడారం జాతర కోసం అధికారులు రూ.128కోట్లతో ప్రతిపాదనలు పంపిస్తే అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం కేవలం రూ.75కోట్లు మాత్రమే కేటాయించింది.

2022లో కూడా ప్రభుత్వం రూ.75కోట్లే కేటాయించింది. దీంతో బీఆర్ఎస్ ప్రభుత్వం మేడారం జాతరపై చిన్నచూపు చూస్తోందనే విమర్శలు వినిపించాయి. 2014 జాతరకు ఎన్నికల కోడ్ పేరుతో గత ప్రభుత్వం నిధులు కేటాయింపులు చేయకుండా చేతులెత్తేసింది. సెప్టెంబరు, అక్టోబరు నెలలోనే మహాజాతరకు నిధులు కేటాయించాల్సి ఉన్నప్పటికీ, గత ప్రభుత్వం ఆ దిశగా దృష్టి సారించలేదు. దీంతో 2023 డిసెంబరు 7న కాంగ్రెస్ ప్రభుత్వం రావటంతో మేడారం జాతరకు రూ.105కోట్లు కేటాయించింది. మహాజాతరకు కేవలం రెండు నెలల గడువే ఉన్నప్పటికీ యుద్ధప్రాతిపాదికన అభివృద్ధి పనులు చేపట్టారు. సీఎం రేవంత్‌రెడ్డి మేడారం మహాజాతరకు అధిక ప్రాధాన్యత ఇస్తూ ఐదు నెలల ముందే మహాజాతరకు రూ.150కోట్లు కేటాయించారు. నిధులు కేటాయింపులు ముందుగా జరగటంతో టెండర్ల ప్రక్రియ సాఫీగా జరగటంతో పాటు ఇతర పనులను నాణ్యతతో చేపట్టే అవకాశం ఉంటుంది.

## ఉప రాష్ట్రపతి పదవికి జస్టిస్
### బి.సుదర్శన్‌రెడ్డి నామినేషన్ దాఖలు

మొదటిపేజీ తరువాయి

ఉప రాష్ట్రపతి ఎన్నికలో ప్రతిపక్షాల ఉమ్మడి అభ్యర్థి జస్టిస్ బి.సుదర్శన్‌రెడ్డి నామినేషన్ దాఖలు చేశారు. తన నామినేషన్ పత్రాలను రిటర్నింగ్ అధికారికి సమర్పించారు. కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, సోనియా గాంధీ, రాహుల్ గాంధీ, శరద్ పవార్ సహా విపక్ష పార్టీల నేతలు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఎన్‌సీపీ (ఎస్పీ) అధినేత శరద్ పవార్, ఎస్పీ నేత రామ్‌గోపాల్ యాదవ్, డీఎంకే తిరుచ్చి శివ, టీఎంసీ నేత శతాబ్ది రాయ్, శివసేన (యూబీటీ) సంజయ్ రౌత్, సీపీఐ(ఎం) జాన్ బ్రిటాస్‌లు ఈ నామినేషన్ దాఖలు కార్యక్రమంలో పాల్గొన్నారు. దాదాపు 160 మంది ఎంపీలు ఆయనకు మద్దతుగా సంతకాలు చేసినట్లు సమాచారం. నామినేషన్ పత్రాలను పరిశీలించిన రిటర్నింగ్ అధికారి జస్టిస్ సుదర్శన్‌రెడ్డికి రశీదును అందజేశారు.

ఈసందర్భంగా జస్టిస్ సుదర్శన్‌రెడ్డి మీడియాతో మాట్లాడుతూ.. రాజ్యాంగ విలువలపై నిబద్ధత, వినయభావంతో నామినేషన్ దాఖలు చేస్తున్నానని అన్నారు. తన జీవితం ప్రజాస్వామ్య సంప్రదాయాలతో ముడిపడి ఉందన్న ఆయన.. ప్రతి వ్యక్తి గౌరవం పైనే భారత్ వాస్తవశక్తి ఆధారపడి ఉందన్నారు.

మరోవైపు ఎన్డీయే కూటమి అభ్యర్థిగా సీపీ రాధాకృష్ణన్ ఆగస్టు 20న నామినేషన్ దాఖలు చేశారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చేతులమీదుగా ఆయన తన నామినేషన్ పత్రాలను రిటర్నింగ్ అధికారికి సమర్పించిన విషయం తెలిసిందే. సెప్టెంబర్ 9న ఉప రాష్ట్రపతి ఎన్నిక జరగనుంది. మొత్తం ఎలక్టోరల్ కాలేజీ సంఖ్య 781 కాగా మెజార్టీ మార్కు 391. అధికార పక్షానికి 422 మంది సభ్యుల మద్దతు ఉంది.

## జస్టిస్ ఘోష్ కమిషన్ నివేదిక ఆధారంగా చర్యలు తీసుకుంటారా?: హైకోర్టు

మొదటిపేజీ తరువాయి

హైదరాబాద్: కాళేశ్వరం ప్రాజెక్టుపై జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్‌ను రద్దు చేయాలని కోరుతూ మాజీ సీఎం కేసీఆర్, మాజీ మంత్రి హరీశ్‌రావు దాఖలు చేసిన పిటిషన్లపై విచారణను హైకోర్టు శుక్రవారానికి వాయిదా వేసింది.

కేసీఆర్ తరఫున సుప్రీంకోర్టు న్యాయవాది ఆర్యామ సుందరం వాదనలు వినిపించారు. జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ నిబంధనలు పాటించలేదని కోర్టుకు వివరించారు. నోటీసులు సరైన విధానంలో ఇవ్వలేదన్నారు. అంతేకాకుండా నివేదికను కేసీఆర్, హరీశ్‌రావుకు ఇవ్వలేదని చెప్పారు. కమిషన్ సమర్పించిన నివేదికను ప్రభుత్వం పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చిందని న్యాయస్థానం దృష్టికి తీసుకెళ్లారు. రాజకీయంగా భారత రాష్ట్ర సమితికి, కేసీఆర్‌కు నష్టం చేకూర్చేలా నివేదిక రూపొందించారని ఆరోపించారు. ప్రభుత్వం తరఫు న్యాయవాది వాదనలు వినిపిస్తూ.. విలేకరుల సమావేశంలో సీఎం కమిషన్ నివేదిక వివరాలను తెలిపారని అన్నారు. వెబ్‌సైట్‌లోనూ అప్‌లోడ్ చేశారని, కేసీఆర్‌కు మాత్రం నివేదిక కాపీలు ఇవ్వలేదని, దీనిపై ప్రభుత్వానికి లేఖ రాసినా స్పందన లేదని కేసీఆర్ తరఫు న్యాయవాది ధర్మాసనం దృష్టికి తెచ్చారు. కమిషన్ నివేదికపై ప్రభుత్వం త్రిసభ్య కమిటీ ఏర్పాటుచేసిందని ప్రభుత్వం తరఫు న్యాయవాది తెలిపారు. అసెంబ్లీలో చర్చించేలా ప్రభుత్వం ప్రణాళిక రూపొందిస్తున్నట్లు అడ్వకేట్ జనరల్ సుదర్శన్‌రెడ్డి న్యాయస్థానానికి వివరించారు. ఇద్దరు పిటిషనర్లు అసెంబ్లీలో సభ్యులుగా ఉన్నారని తెలిపారు. అలాంటప్పుడు నివేదికను ఎందుకు బయటపెట్టారని ఏజీని హైకోర్టు ప్రశ్నించింది. మీడియా సమావేశంలో ప్రతి విలేకరికి 60 పేజీల నివేదిక ఇచ్చారని కోర్టుకు తెలిపారు. కోర్టుకు సమర్పించిన నివేదిక కాపీలు సరిగ్గా కనిపించడం లేదని సీజే అన్నారు. ప్రాధాన్యం దృష్ట్యా విచారణ ఇవాళే కొనసాగించాలని కేసీఆర్ తరఫు న్యాయవాది కోర్టును అభ్యర్థించారు. కమిషన్ నివేదిక ఆధారంగా చర్యలు తీసుకుంటారా? అసెంబ్లీలో ప్రవేశపెట్టి చర్చ తర్వాత చర్యలు తీసుకుంటారా? అని హైకోర్టు ధర్మాసనం.. ఏజీని ప్రశ్నించింది. ప్రభుత్వ నిర్ణయం చెప్పడానికి సమయం కావాలని ఏజీ సుదర్శన్‌రెడ్డి కోరారు. దీంతో విచారణను హైకోర్టు రేపటికి వాయిదా వేసింది.

## రాచకొండ సీపీ ఎదుట లొంగిపోయిన సెంట్రల్ కమిటీ మావోయిస్టు సభ్యులు

మొదటిపేజీ తరువాయి

"వరవరరావు, గద్దర్ లాంటి విప్లవకారులు వారి ఇంటికి వస్తుండటంతో సునీత మావోయిస్టుల సిద్ధాంతాల వైపు మొగ్గు చూపారు. ఆమె 1986లో పీపుల్స్ వార్ పార్టీలో ఉన్నారు. 1986 ఆగస్టులో టీఎల్ఎన్ చలం గౌతమ్ అలియాస్ సుధాకర్‌ను వివాహం చేసుకున్నారు. విజయవాడ, గుంటూరు ప్రాంతాల్లో సెంట్రల్ ఆర్గనైజర్‌గా పనిచేశారు. 1992లో నల్లమల అడవుల్లోకి వెళ్లారు. 2001లో ఏవోబీ ప్రాంతానికి, 2006లో దండకారణ్యానికి బదిలీ అయ్యారు.

చెన్నూరి హరీశ్ అలియాస్ రమణ కూడా నేడు లొంగిపోయారు. ఆయన పదో తరగతి చదువుతున్నప్పుడు ఏటూరునాగారం బీసీ వెల్ఫేర్ హాస్టల్‌లో మావోయిస్టు సిద్ధాంతానికి ఆకర్షితులయ్యారు. 2024లో ఏసీఎంగా పనిచేశారు. వీరిద్దరూ ఎన్నో ఎన్‌కౌంటర్లలో పాల్గొన్నారు. జనజీవన స్రవంతిలో పాల్గొనడం మంచి పరిణామం" అని సీపీ తెలిపారు.

## లోక్‌సభలో పెట్టిన బిల్లుతో దోచుకున్నవారికి బాధ కలుగుతోంది:

మొదటిపేజీ తరువాయి

దిల్లీ: రాజకీయాల్లో ఆరోపణలు వచ్చినప్పుడు స్వచ్ఛందంగా పదవి నుంచి వైదొలగాలని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి తెలిపారు. ఆరోపణలతో జైలుకు వెళ్తే పదవి నుంచి వైదొలగాలన్నారు. దిల్లీ మద్యం కుంభకోణంలో అరవింద్ కేజ్రీవాల్ 6 నెలలుగా పైగా జైలులో ఉన్నప్పుడు అక్కడే అధికారులతో రివ్యూ మీటింగ్‌లు పెట్టారని విమర్శించారు. జైలు నుంచే పాలన చేసి.. ప్రభుత్వ యంత్రాంగాన్ని భ్రష్టు పట్టించారన్నారు. తమిళనాడులో మంత్రి సెంథిల్ బాలాజీ జైలుకెళ్లినా రాజీనామా చేయలేదని తెలిపారు. ప్రభుత్వాలను కాపాడే నేతలు, పార్టీలకు నైతిక విలువలు అవసరమని పేర్కొన్నారు. దిల్లీలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.."కొందరు నాయకులు బీఆర్ అంబేడ్కర్ రాసిన రాజ్యాంగాన్ని ఉల్లంఘిస్తున్నారు. దీంతో కేంద్ర ప్రభుత్వం నైతిక విలువలను కాపాడేందుకు రాజ్యాంగ సవరణ తీసుకువస్తోంది. ఇందు కోసం లోక్‌సభలో బిల్లు పెట్టాం. దీన్ని ఏకపక్షంగా తీసుకురావాలని అనుకోవడంలేదు. జేపీసీ ద్వారా దేశంలోని ప్రజలు, మేధావులు, విద్యావంతులు, రాజ్యాంగ నిపుణులు, న్యాయ నిపుణుల సలహాలు తీసుకుంటున్నాం. లోక్‌సభలో పెట్టిన బిల్లు వల్ల దోచుకున్న వారికి కొంత బాధ కలుగుతోంది. కాంగ్రెస్ పార్టీకి ఎందుకు బాధ కలుగుతుందో అర్థం కావడం లేదు. భవిష్యత్తులో జరిగే 3 రాష్ట్రాల ఎన్నికల్లో కాంగ్రెస్ ఘోరంగా ఓటమి చెందుతుంది" అని కిషన్‌రెడ్డి అన్నారు.

## నాగార్జునసాగర్ జలాశయానికి భారీగా వరద ప్రవాహం.. 26 గేట్లు ఎత్తి నీటి విడుదల

మొదటిపేజీ తరువాయి

శ్రీశైలం జలాశయానికి కొనసాగుతున్న వరద

శ్రీశైలం జలాశయానికి వరద ప్రవాహం మరింత పెరుగుతోంది. జూరాల, సుంకేసుల ప్రాజెక్టుల నుంచి వరద వచ్చి చేరుతోంది. శ్రీశైలం ప్రాజెక్టుకు ఇన్‌ఫ్లో 4,98,022 క్యూసెక్కులు వస్తోంది. జలాశయం నుంచి 5,13,540 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ నుంచి 30,000 క్యూసెక్కులు, ఎడమ గట్టు విద్యుత్ కేంద్రం నుంచి 35,315 క్యూసెక్కులు, కుడిగట్టు విద్యుత్ కేంద్రం నుంచి 29,595 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. 10 స్పిల్‌వే గేట్లను 18 అడుగులు ఎత్తి.. 4,18,630 క్యూసెక్కులు నాగార్జునసాగర్‌కు విడుదల చేస్తున్నారు. శ్రీశైలం పూర్తిస్థాయి నీటిమట్టం 885 అడుగులు కాగా.. ప్రస్తుతం 881.60 అడుగులకు చేరింది. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి నిల్వ సామర్థ్యం 215.80 టీఎంసీలు కాగా.. ప్రస్తుతం 197.01 టీఎంసీలుగా నమోదైంది.

# హెడ్ కానిస్టేబుల్ రాజశ్రీకి ఏఎస్ఐగా పదోన్నతి




**కొండబత్తిని అమర్ నాథ్, కోరుట్ల టౌన్ ప్రతినిధి**
కోరుట్ల పోలీస్ స్టేషన్ లో హెడ్ కానిస్టేబుల్ గా పనిచేసిన రాజశ్రీ అసిస్టెంట్ సబ్ ఇన్‌స్పెక్టర్ గా పదోన్నతి పొందారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ ను గురువారం కలిసి, ఆయన చేతుల మీదుగా స్టార్ చిహ్నాన్ని అలంకరించుకున్నారు. పెరిగిన బాధ్యతలను క్రమశిక్షణతో నిర్వర్తించి, ప్రజలలో పోలీసు శాఖ పట్ల నమ్మకాన్ని, గౌరవాన్ని పెంచాలని ఎస్పీ సూచించారు.

# ఇసుక రీచ్ రద్దు చేయాలని ఎమ్మెల్యే, కలెక్టర్‌కు విజ్ఞప్తి

**గాజెంగి మహేశ్వర్, కరపత్రం మెటుపల్లి**



జగిత్యాల జిల్లా మెట్‌పల్లి మండలం ఆత్మకూరు గ్రామంలో ఇసుక రీచ్‌ను రద్దు చేయాలని కోరుట్ల ఎమ్మెల్యే డా. కల్వకుంట్ల సంజయ్ జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్‌ను కోరారు. ఈ మేరకు ఆయన లేఖను జిల్లా అడిషనల్ కలెక్టర్ బిఎస్ లతకు అందించారు. మెట్‌పల్లి మాజీ ఎంపీపీ మారు సాయిరెడ్డి, ఆత్మకూర్ గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు, ప్రజా విచారణ, పర్యావరణ అనుమతి లేకుండా జరుగుతున్న ఇసుక రవాణా సమస్యను అడిషనల్ కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. గ్రామ ప్రజలు తీవ్ర ఆందోళనలో ఉన్నారని, ఏకగ్రీవంగా ఇసుక రవాణాకు వ్యతిరేకంగా ఉన్నారని తెలిపారు.




**– రద్దుకు ఎమ్మెల్యే సిఫార్సు**

ఈ ఫిర్యాదు పురస్కరించుకుని కోరుట్ల ఎమ్మెల్యే డా.కల్వకుంట్ల సంజయ్ జగిత్యాల జిల్లా అడిషనల్ కలెక్టర్ బిఎస్ లతను కలిసి మెట్‌పల్లి మండలం ఆత్మకూరులో ప్రజా విచారణ, పర్యావరణ అనుమతులు లేకుండా జరుగుతున్న ఇసుక రవాణాను రద్దు చేయాలని కోరారు. మాజీ ఎంపీపీ మారు సాయిరెడ్డి, గ్రామ కమిటీ సభ్యులు ఈ లేఖను అందించారు. గ్రామ ప్రజలు ఇసుక రవాణాకు వ్యతిరేకంగా ఉన్నారని, దీనివల్ల జీవన విధానం, భద్రత, పర్యావరణం ముప్పులో పడుతున్నాయని, శాంతి భద్రతల సమస్యలు తలెత్తే ప్రమాదం ఉందని వారు తెలిపారు.

## ప్రశాంతంగా ఉత్సవాలు జరుపుకోవాలి

**– కథలాపూర్ ఎస్ఐ**



**కొండబత్తిని అమర్ నాథ్, కరపత్రం కోరుట్ల**
కథలాపూర్ మండలంలో గణేశ్ నవరాత్రి ఉత్సవాలను ప్రశాంతంగా జరుపుకోవాలని ఎస్ఐ నవీన్ కుమార్ సూచించారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఎమ్మార్వో వినోద్, ఎంపీడీఓ శంకర్ తో కలిసి నిర్వహించిన శాంతి కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ గణేశ్ మండపాల ఏర్పాటుకు తప్పనిసరిగా అనుమతి తీసుకోవాలని, గ్రామాల్లో ఏర్పాటు చేసే విగ్రహాల వివరాలను పోలీసులకు తెలియజేయాలని తెలిపారు. ప్రధాన కూడళ్ల వద్ద రాకపోకలకు ఇబ్బంది కలగకుండా మండపాలు ఏర్పాటు చేసుకోవాలని, ప్రతి విగ్రహం వద్ద ఒక ఇన్‌చార్జిని నియమించాలని సూచించారు.

# వినాయక విగ్రహాల తరలింపు

**– అప్రమత్తత అవసరం**



**గాజెంగి మహేశ్వర్, కరపత్రం మెటుపల్లి**
రాబోయే వినాయక చవితి సందర్భంగా భారీ వినాయక విగ్రహాల తరలింపులో విద్యుత్ లైన్లను తాకకుండా అప్రమత్తంగా ఉండాలని జగిత్యాల జిల్లా మెట్ పల్లి ఏడీఈ మనోహర్ నిర్వాహకులకు గురువారం విజ్ఞప్తి చేశారు. 20అడుగుల పైబడిన విగ్రహాల రవాణాలో విద్యుత్ లైన్ల క్రాసింగ్ వద్ద వెదురు బొంగులతో వైర్లను తప్పించే ప్రయత్నంలో షాక్ తో మరణించిన సంఘటనలున్నాయని ఆయన గుర్తు చేశారు. గతంలో జరిగిన ప్రమాదాలను పరిగణనలోకి తీసుకుని, విద్యుత్ శాఖ సిబ్బందికి సమాచారం అందిస్తే సరఫరా నిలిపివేసి సహకరిస్తారని తెలిపారు. అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

## న్యాయవాదులకు హెల్త్ కార్డుల పంపిణీ




**గాజెంగి మహేశ్వర్, కరపత్రం మెటుపల్లి**
జగిత్యాల జిల్లా మెట్‌పల్లి పట్టణంలో గురువారం మెట్‌పల్లి బార్ అసోసియేషన్ సభ్యులకు 2025-26 సంవత్సరానికి సంబంధించిన హెల్త్ కార్డులను పంపిణీ చేశారు. అడ్వకేట్ వెల్ఫేర్ ట్రస్ట్ ద్వారా న్యాయవాదులకు జారీ చేయబడిన ఈ హెల్త్ కార్డులతో ఎన్నో ప్రయోజనాలున్నాయని బార్ అసోసియేషన్ అధ్యక్షులు కంతి మోహన్ రెడ్డి అన్నారు. ఈ కార్డులతో రూ. 2 లక్షల వరకు మెడిక్లెయిమ్ చేసుకోవచ్చుని, రూ. 10 లక్షల వరకు యాక్సిడెంట్ కవరేజ్ ఉంటుందని ఆయన తెలిపారు.

# మెటుపల్లిలో గణేష్ ఉత్సవాల సమన్వయ సమావేశం



**గాజెంగి మహేశ్వర్, కరపత్రం మెటుపల్లి**
జగిత్యాల జిల్లా మెట్ పల్లి టౌన్ మండల పరిధిలో గణేష్ ఉత్సవాలు, నిమజ్జన కార్యక్రమాలను ప్రశాంతంగా నిర్వహించేందుకు గురువారం మెట్ పల్లి పోలీస్ స్టేషన్ ప్రాంగణంలో సమన్వయ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో మెట్ పల్లి డీఎస్పీ, సీఐ, ఎస్ఐ, మెట్ పల్లి మున్సిపల్ కమిషనర్, ఎంఆర్ఓ, విద్యుత్ శాఖ ఏఈ తదితర అధికారులు పాల్గొన్నారు. గణేష్ మండప నిర్వాహకులకు అధికారులు పలు సూచనలు చేశారు. ఉత్సవాల సమయంలో శాంతి భద్రతలు కాపాడుకోవాలని, ట్రాఫిక్ అంతరాయాలు కలగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు.

# మేడ్చల్ జిల్లాలో

## మునిసిపల్ కమీషనర్ల బదిలీలు



**కరుణాకర్ మల్లిగారి, కరపత్రం ప్రతినిధి**
మేడ్చల్ జిల్లాలో, ముఖ్యంగా మేడ్చల్ మండలంలోని మునిసిపల్ కమిషనర్ల బదిలీలు జరిగాయి.తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రాత్రికి రాత్రే ఈ బదిలీలు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది.గుండ్ల పోచంపల్లి మున్సిపల్ కమీషనర్ గా పనిచేస్తున్న శ్రీ అజ్మీర స్వామి నాయక్ ను ఎల్లంపేట మున్సిపాలిటీకి బదిలీ చేశారు.
ఎల్లంపేట మున్సిపాలిటీలో కమిషనర్ గా పనిచేస్తున్న శ్రీ నిత్యానందం ను పోచారం మున్సపాలిటీకి మరియు గుండ్ల పోచంపల్లి మునిసిపాలిటీకి శ్రీ వెంకట గోపాల్ గారిని కమిషనర్ గా బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి.నియమించబడిన స్థానాల్లో కొత్త మునిసిపల్ కమిషనర్లుగా ఈ అధికారులు బాధ్యతలు స్వీకరించారు.

# హైదరాబాద్ జిల్లాలో భారీ వర్షాలు

**కరుణాకర్ మల్లిగారి, కరపత్రం ప్రతినిధి**



అల్పపీడనం ప్రభావంతో తెలంగాణలో భారీ వర్షాలు కురవనున్నాయని వాతావరణ కేంద్రం హెచ్చరించింది. ఈ మేరకు నేడు ఆదిలాబాద్, ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, పెద్దపల్లి, భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, మహబూబాబాద్, వరంగల్, హన్మకొండ, జనగాం, సిద్దిపేట, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపింది. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచిస్తున్నారు.

### ఇన్విటేషన్ వాలీబాల్ టోర్నీ ప్రారంభించిన ఎన్ సీ సంతోష్

**గజ్వేల్ ఆగస్ట్ 21,కరపత్రం ప్రతినిధి**
క్రీడలు మానసిక ఉల్లాసంతో పాటు శరీర దృఢత్వాన్ని కలిగిస్తాయని సిద్దిపేట జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షుడు ఎన్ సీ సంతోష్ అన్నారు గురువారం సిద్దిపేట జిల్లా గజ్వేల్ పట్టణ కేంద్రంలో ఫిట్నెస్ టీం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఇన్విటేషన్ వాలీబాల్ టోర్నీ సిద్దిపేట జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షుడు ఎన్ సీ సంతోష్ ప్రారంభించారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వాలీబాల్ టోర్నీ నిర్వహిస్తున్న ఫిట్నెస్ టీం సభ్యులకు అభినందనలు తెలిపి, గజ్వేల్ నియోజకవర్గం లోని దాదాపు 12 కు పైగా స్కూల్స్ క్రీడాకారులు పాల్గొనడం అభినందనీయమని యువత క్రీడల్లో రాణించాలని, వాలీబాల్ క్రీడల్లో రాణించి జాతీయస్థాయిలో గజ్వేల్ పేరును నిలబెట్టాలని అన్నారు, ఈ కార్యక్రమంలో రామ్మోహన్, కానిస్టేబుల్ సంతోష్,ఫిట్నెస్ టీం సభ్యులు తదితరులు పాల్గొన్నారు,

# పెద్దమ్మ దేవాలయానికి వంట పాత్రల బహూకరణ



**కరపత్రం ప్రతినిధి వీణవంక ఆగస్టు 21**
కరీంనగర్ జిల్లా, వీణవంక మండలం, మల్లారెడ్డిపల్లి గ్రామంలో గల పెద్దమ్మ దేవాలయంలో ప్రతి శుక్రవారం గత 26 వారాలుగా అమ్మ ఫౌండేషన్ మల్లారెడ్డిపల్లి వారి ఆధ్వర్యంలో దాతల సహకారంతో అన్నప్రసాద వితరణ నిర్వహిస్తున్నారు. దీనికి కావలసిన వంట పాత్రలను కీర్తిశేషులు నూనె వీరయ్య-ఓదమ్మ దంపతుల జ్ఞాపకార్థం, వారి కుటుంబ సభ్యులు కుమారుడు కోడలు నూనె సతీష్ -పద్మ ,మనుమరాలు, మనుమడు సౌమ్య ,రాజు ,గ్రామం :కన్నాపూర్, మండలం: శంకరపట్నం, జిల్లా: కరీంనగర్ వారి నివాసం హైదరాబాద్ వాస్తవ్యులు 6000/-ఆరువేల రూపాయల విలువగల వంట పాత్రలు బహుకరణ చేసినారు.ఈ సందర్భంగా అమ్మ ఫౌండేషన్ మల్లారెడ్డిపల్లి వ్యవస్థాపక అధ్యక్షులు మరియు ఆలయ చైర్మన్ గోనెల సమ్మన్న ముదిరాజ్ మాట్లాడుతూ మేము చేస్తున్న కార్యక్రమాలకు ఎప్పటికప్పుడు మాకు వెంట ఉంటూ ఆర్థిక సహకారం అందిస్తున్న దాతలం దరికీ పేరు పేరునా ధన్యవాదాలు తెలియజేస్తూ వారందరినీ పెద్దమ్మతల్లి ఎల్లవేళలా కాపాడాలని వేడుకున్నారు. ఈ కార్యక్రమంలో అమ్మ ఫౌండేషన్ మల్లారెడ్డిపల్లి వ్యవస్థాపక అధ్యక్షులు గోనెల సమ్మన్నముదిరాజ్‌లి ప్రధాన కార్యదర్శి ముద్దసాని శ్రీనివాస్ సభ్యులు రాయణవేణిఅంజి,రాయణవేణి సాగర్,అర్సంసాయి,వీణవంక మండల ఆర్యవైశ్య మహాసభ ఉపాధ్యక్షులు పల్లెర్ల కిరణ్ గుప్తా, మాజీ వార్డ్ మెంబర్ స్వరూప- చంద్రయ్య, మత్స్య పారిశ్రామిక సహకార సంఘం ఉపాధ్యక్షులు రాయణవేణి మదునయ్య, డైరెక్టర్ రాయణవేణి కనుకయ్యలు పాల్గొన్నారు.

# మానకొండూరు ఏమ్మెల్యే ని పరామర్శించిన ప్రణవ్ బాబు

## దేవస్థాన చైర్మెన్ ఇంగిలే రామారావు



**కరపత్రం ప్రతినిధి కరీంనగర్ ఆగస్టు 21**
కరీంనగర్ జిల్లా డిసిసి అధ్యక్షులు ,మానకొండూరు శాసనసభ్యులు డా.కవ్వంపల్లి సత్యనారాయణ సోదరుడు కవ్వంపల్లి రాజేశం ఇటీవల



మరణించగా వారి నివాసానికి వెళ్ళి కుటుంబ సభ్యులను పరామర్శించిన హుజూరాబాద్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జీ వొడితల ప్రణవ్ బాబు అనంతరం చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించిన ప్రణవ్ అన్న ఈ కార్యక్రమంలో శ్రీ సీతారామ చంద్రస్వామి దేవస్థానం చైర్మెన్ ఇంగిలే రామారావు మార్కెట్ వైస్ చైర్మెన్ ఎర్రం సతీష్ రెడ్డి కాంగ్రెస్ పార్టీ నాయకులు సలీం, మార్కెట్ డైరెక్టర్ సూర్య, మాజీ కో ఆప్షన్ సభ్యులు లాల్ తదితరులు పాల్గొన్నారు.

# ద్విచక్ర వాహనంలో డబ్బులు పెట్టి దుకాణంలోకి పోయి వచ్చే వరకే డబ్బు కాజేసిన దొంగలు

**– కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్న పట్టణసీఐ రామకృష్ణ గౌడ్ రామకృష్ణ గౌడ్**

**కరపత్రం ప్రతినిధిజమ్మికుంట ఆగస్టు 21**



కరీంనగర్ జిల్లా జమ్మికుంట పట్టణంలో పెద్దపల్లి గ్రామానికి చెందిన పొద్దుటూరి శ్యామ్ రెడ్డి తేదీ 21 8 2025 రోజున ఫిర్యాది పొద్దుటూరి శ్యామ్ రెడ్డి జమ్మికుంట పట్టణ పోలీస్ స్టేషన్ కి వచ్చి తేదీ 21 8 2025 రోజున ఉదయం 10:30 గంటలకు జమ్మికుంట లోని ఎస్బిఐ బ్యాంకుకు వెళ్లి తన ఖాతాలో ఉన్నటువంటి1,90,000 /బి రూపాయలను విడిపించుకుని తన తన ద్విచక్ర వాహనమైన (ఏపీ 15 6644) నంబర్ గల ద్విచక్ర వాహనం లో ముందు బ్యాగు జిప్ లో పెట్టుకుని తన భార్యని జమ్మికుంట బస్టాండులో బస్సు ఎక్కించి అక్కడి నుండి పాత మార్కెట్ ముందు ఉన్న నందిని కిరాణం షాపు ముందు బండి పెట్టి సామాన్లు తీసుకోవడానికి షాప్ లోకి వెళ్లి అందులో సామాన్లు లేకపోవడంతో పక్క షాపులోకి వెళ్లి సామాన్లు తీసుకొని అట్టి సామాన్లు తీసుకువచ్చి బండి యొక్క ముందు జిప్ లో పెట్టడానికని చూడగా తను పెట్టిన 1,90,000 కనబడడం లేదని ఎవరో గుర్తు తెలియని వ్యక్తులు ఆ డబ్బులని దొంగతనం చేసినారని తెలుపగా కేసు నమోదు చేయడం జరిగిందని పట్టణ సిఐ రామకృష్ణ గౌడ్ తెలిపారు

# "పనుల జాతర-2025" జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్




**కరపత్రం ప్రతినిధి పత్రిక మెదక్ నర్సాపూర్**

పంచాయతీ రాజ్ మరియు గ్రామీణాభివృద్ధి శాఖ, తెలంగాణ ప్రభుత్వం ఆధ్వర్యంలో ఉపాధి హామీ పథకంలో మెదక్ జిల్లాలో "పనుల జాతర-2025" కార్యక్రమంలో భాగంగా గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి మరించి అంకితభావంతో ప్రజలను భాగస్వామ్యం చేయడానికి ఈనెల 22వ తేదీన గ్రామీణ ప్రాంతాలలో పలు అభివృద్ధి పనులు ప్రారంబించడానికి గౌరవ మంత్రులు, పార్లమెంట్ సభ్యులు, స్థానిక శాసన సభ్యులు, శాసనమండలి సభ్యులు మరియు ప్రజాప్రతినిధులను ఆహ్వానించి వారితో పనులు ప్రారంభించడానికి మరియు శంకుస్థాపనలు చేయడానికి నిర్ణయించామని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ తెలిపారు. పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ, పంచాయతీరాజ్-ఇంజనీరింగ్, స్వచ్ఛభారత్ మిషన్ (గ్రామీణ్), ఆర్. డబ్ల్యూ, ఎస్. సమన్వయంతో పనుల జాతర-2025" కి ఏర్పాట్లు చేశామని అన్నారు. ఈ కార్యక్రమంలో చేయవల్సిన పనుల వివరాల గురించి తెలిపారు. ఈ ఆర్థిక సంవత్సరంలో చేపట్టే నూతన గ్రామ పంచాయతీ భవనాలు, అంగన్వాడి భవనాల నిర్మాణాలకు, స్వచ్ఛ భారత్ మిషన్ (గ్రామీణ్) ద్వారా నిర్మించే ప్లాస్టిక్ వేస్ట్ మేనేజ్మెంట్ యూనిట్, సెగ్రిగేషన్ షెడ్, కమ్యూనిటీ సానిటరీ కాంప్లెక్స్, పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ శాఖ ద్వారా గ్రామీణ రహదారుల నిర్మాణం (సి ఆర్ ఆర్) నిధులతో కొత్తగా చేపట్టే పనులకు శంకుస్థాపనలు చేయడం జరుగుతుందని తెలిపారు. ఇప్పటికీ పూర్తి అయిన గ్రామ పంచాయతీ భవనాలు, అంగన్వాడీ భవనాలను, గ్రామీణ రహదారుల సిసి రోడ్లు, ఇతర అభివృద్ధి వసుల ప్రారంభోత్సవానికి ఏర్పాటు చేయడం జరిగింది. ఇందిరమ్మ మహిళా శక్తి ఉపాధి భరోసా క్రింద చేపట్టే పలు జీవనోపాధి పనులు (వ్యక్తిగత ఆస్తుల కల్పన) ముఖ్యంగా స్వయం సహాయక మహిళలకు పశువుల కొట్టాల నిర్మాణం, కోళ్ల షడ్లు నిర్మాణం, గొర్రెల షెడ్ల నిర్మాణం, కొత్త వ్యవసాయ బావుల నిర్మాణం చేపట్టడం పండ్ల తోటల పెంపకం, వానపాముల ఎరువుల తయారీ నిర్మాణం, అజోలా పిట్ల నిర్మాణం లాంటి పనుల మంజూరీ ఉత్తర్వులను సమావేశములో లబ్దిదారులకు అందించడం జరుగుతుందనిలి ప్రతి గ్రామంలో మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాది హామీ పథకములో వ్యక్తిగత లబ్దిదారులకు చెందిన కనీసం ఒక పని అయిన శు క్రవారం నాడు శంకుస్థాపన చేయడం ప్రధాన ఉద్దేశ్యంగా చెప్పారు

## లైన్ ఇంటర్నేషనల్ డిస్టిక్ 320జి సమావేశం.

**కరపత్రం ప్రతినిధి కరీంనగర్ ఆగస్టు 21**




2025 -26 సంవత్సరం పదవడిస్టిక్ క్యాబినెట్ ఇన్స్టాలేషన్ గవర్నర్ సింహరాజు కోదండరాం ఆధ్వర్యంలో వసుధ కన్వెన్షన్ లో జరిగింది. ఈ సందర్భంగా 2025- 26 సంవత్సరానికి గాను రాజరాజేశ్వరి లైన్స్ క్లబ్ ఆఫ్ కరీంనగర్ క్లబ్ సభ్యత్వం పెంచినందుకు క్లబ్ అధ్యక్షులు నరహరి లక్ష్మారెడ్డి, కార్యదర్శి బండ కిషన్ రెడ్డి, మాజీ అధ్యక్షురాలు వేల్పుల శశికళ లను సభా వేదిక పైన గవర్నర్ సింహరాజు కోదండరాం, మొదటి ఉప గవర్నర్ మోర బద్రేషం, రెండో ఉప గవర్నర్ గుంటుక చంద్ర ప్రకాష్ సన్మానించారు. ఆర్ సి కొల్లూరి జితేందర్, జెడ్ సి సిరిపురం ప్రసాద్, క్లబ్ సభ్యులు నరహరి లక్ష్మి, లంబు రాజిరెడ్డి, గుండేటి రామచంద్రమ్, సంధి మోహన్ రెడ్డి, బండ గోపాల్ రెడ్డి, ఎడబోయిన సంజీవరెడ్డి పాల్గొన్నారు.

## సింగరేణి అవార్డు గ్రహీత బొమ్మకకు సన్మానం



**కొమురయ్య నాగం,కరపత్రం ప్రతినిధి**

మాల సంఘం కళాబృందం పెద్దపెల్లి జిల్లా అధ్యక్షుడు, సింగరేణి కార్మికుడు బొమ్మక వెంకటేశ్వర్లుకు గురువారం మాల సంఘం రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. వక్తలు మాట్లాడుతూ రానున్న కాలంలో వెంకటేశ్వర్లకు దేవుడు అన్ని విధాల సహకరించి ఉన్నత పదవులను అధిరోహించాలని, అలాగే మాల సంఘం నకు తన యొక్క సేవలు అందించాలని తెలియజేశారు, ఈ కార్యక్రమంలో మద్రి ఐలయ్య జనరల్ సెక్రటరీ, మాలెం మధు రామగుండం నియోజకవర్గం ఇంచార్జ్, మరియు దేవా వెంకటేశం, వీరితోపాటు జన విజ్ఞాన పరిషత్ పెద్దపెల్లి జిల్లా అధ్యక్షులు ఎరుకల లక్ష్మణరావు, మాల సంఘం సమన్వయకర్త నంది నరేష్, కొండ కుమార్, కడమండ శ్రీహరి,మాజీ అధ్యక్షులు పిట్టల వెంకటి, ఎరుకల లింగమూర్తి, అందువల్ల లింగయ్య, జన విజ్ఞాన పరిషత్ జూపాక పోశం, ఆనంద్, కొండ సురేష్, దాసరి రామస్వామి, దాసరి రమేష్, నంది నగేష్, నూకల మొండి, దాసరి వెంకటేశ్వర్లు, అధిక సంఖ్యలో మాల కుల బంధువులు అధిక సంఖ్యలో సన్మాన కార్యక్రమంలో పాల్గొన్నారు.

# జమ్మికుంట ప్రభుత్వ డిగ్రీ అండ్ పీజీ కళాశాలలో వైద్య శిబిరం

**కరపత్రం ప్రతినిధి జమ్మికుంట ఆగస్టు 21**

జమ్మికుంట మండలం వావిలాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధి లోని జమ్మికుంట మున్సిపల్ పరిధి ప్రభుత్వ డిగ్రీ & పీజీ కళాశాల గర్ల్స్ హాస్టల్ లో డాక్టర్ చందన ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించడం జరిగినది. ఈ వైద్య శిబిరంలో 35మంది విద్యార్థినులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేయడం జరిగినది. అదేవిధంగా వర్తక సంఘం ఏరియాలో డాక్టర్ మహెూన్నత పటేల్ ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించి 58 మంది కాలనీ వాసులకు వైద్య పరీక్షలు నిర్వహించి అవసరం ఉన్నవారికి మందులు పంపిణీ చేయడం జరిగింది. ముగ్గురు జ్వర పీడితులకి రక్త నమూనాలను సేకరించి పరీక్షల నిమిత్తం ల్యాబ్ కి పంపించనైనది. అదేవిధంగా వెంకటేశ్వర పల్లి గ్రామంలో డాక్టర్ బిందు ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించి 30 మంది గ్రామ ప్రజలకు వైద్య పరీక్షలు నిర్వహించి అవసరం మేరకు మందులు పంపిణీ చేయడం జరిగింది ముగ్గురు జ్వర పీడితులను గుర్తించి రక్త నమూనాలను సేకరించి వ్యాధి నిర్ధారణకు ల్యాబ్






కు పంపించడం జరిగింది. ఈ వైద్య శిబిరాలకు వచ్చిన ప్రజలకు అసంక్రామిత వ్యాధులు రక్త పోటు, మధుమేహం పరీక్షలు నిర్వహించి అవసరం ఉన్న వారికి మందులు ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా గ్రామస్తులకి సీజనల్ వ్యాధులు మలేరియా, డెంగీ, చికెన్ గున్య మొదలగు వ్యాధులు వ్యాపించు విధానం, వ్యాధి లక్షణాలు, తీసుకోవలసిన జాగ్రత్తల గురించి క్లుప్తంగా వివరించి చెప్పడం జరిగింది. వ్యక్తి గత పరిశుభ్రత, పరిసరాల పరిశుభ్రత మరియు డ్రై డే ల పై అవగాహన కల్పించనైనది. మహిళలకు ఆరోగ్య మహిళా ప్రోగ్రాం పై అవగాహన కల్పించనైనది. దోమల నివారణ మరియు అవి కుట్ట కుండా తీసుకోవలసిన జాగ్రత్తలను గ్రామస్తులకి అవగాహన కల్పించనైనది.

ఈ కార్యక్రమములో డాక్టర్ చందన,డాక్టర్ మహెూన్నత పటేల్,డాక్టర్ బిందు,హెల్త్ ఎడ్యుకేటర్ మోహన్ రెడ్డి, హెల్త్ సూపర్ వైజర్స్ రత్నకుమారి,సదానందం,హెల్త్ అసిస్టెంట్ నరేందర్, ఏ ఎన్ ఎం ఏ లు మంజుల,రజిత,రాదా ఆశా కార్యకర్తలు గ్రామస్తులు పాల్గొన్నారు

## ప్రపంచ దేశాలకు కమ్యూనిజమే ప్రత్యామ్నాయం

**కరపత్రం ప్రతినిధి గోదావరిఖని ఆగస్టు 21:**



మేడ్చల్- మల్కాజ్ గిరి జిల్లా గాజుల రామరం హైదరాబాద్ లో జరుగుతున్న సిపిఐ తెలంగాణ రాష్ట్ర 4వ మహా సభలకు పెద్దపల్లి జిల్లా నుండి తల్లి -తనయుడు ప్రతినిధులుగా హాజరయ్యారు. పెద్దలు చెప్పిన మాట వినని ఈ రోజుల్లో తల్లి ఏలు పట్టుకొని-ఎర్ర జెండా పట్టుకొని పేద ప్రజల అండ సిపిఐ జెండా అంటూ ఆనాడే నినాదిస్తూ బడుగు, బలహీన వర్గాల సమస్యల పరిష్కారమే ధ్యేయమని పోరు చేశారు. మహిళలపై జరుగుతున్న అత్యాచారాలపై, అఘాయిత్యాలపై ఎన్ఎఫ్ఐడబ్ల్యూ పెద్దపెల్లి జిల్లా కార్యదర్శిగా అటు తల్లి ,విద్యా రంగ సమస్యల పరిష్కారమే నా కర్తవ్యం అని ఏఐఎస్ఎఫ్ పెద్దపల్లి జిల్లా కార్యదర్శిగా ఇటు తనయుడు భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ ప్రజా సంఘాలలో చురుకుగా పని చేస్తున్నారు. భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ లో వారసత్వం కొనసాగిస్తూ పార్టీ బలోపేతానికి కృషి చేస్తున్నారు. పార్టీలో చురుకుగా పనిచేస్తునందున రాష్ట్ర నాయకత్వం హర్షించారు.

## గణేష్ నవరాత్రులను శాంతియుతంగా, భద్రతతో నిర్వహించాలి
## - కరీంనగర్ పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం, ఐపీఎస్.

**కొమురయ్య నాగం,కరపత్రం ప్రతినిధి**

కరీంనగర్ కమిషనరేట్ పరిధిలోని గణేష్ మండపాల నిర్వాహకులు, ప్రజలు గణేష్ నవరాత్రులను ప్రశాంతంగా, సురక్షితంగా జరుపుకోవాలని కరీంనగర్ పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం ఐపీఎస్ సూచించారు. ఈ సందర్భంగా పోలీస్ శాఖ తరపున ఆయన పలు మార్గదర్శకాలను జారీ చేశారు.

తప్పనిసరిగా పోలీసుల అనుమతి పొందాలి గణేష్ మండపాలను ఏర్పాటు చేసేవారు తప్పనిసరిగా పోలీసు అనుమతి కోసం దరఖాస్తు చేసుకోవాలి. గణేష్ ప్రతిమ ఎత్తు, మండపం ఏర్పాటు చేసే స్థలం, నిమజ్జనం తేదీ, నిమజ్జనం ప్రదేశం వంటి వివరాలను తెలంగాణ పోలీస్ వెబ్సైట్ (https://policeportal.tspolice.gov.in/index.htm) లో నమోదు చేయాలి. ఆన్లైన్లో దరఖాస్తు చేసుకున్న తర్వాత, సంబంధిత పోలీస్ స్టేషన్ అధికారులు అనుమతులు జారీ చేస్తారు. అనుమతి పత్రం, క్యూఆర్ కోడ్, పోలీస్ సూచనలను మండపం వద్ద స్పష్టంగా ప్రదర్శించాలి. నిర్వహణ , భద్రతా చర్యలు మండపాలకు విద్యుత్ కనెక్షన్లు విద్యుత్ శాఖ



అనుమతితోనే తీసుకోవాలి. ప్రమాదాలు జరగకుండా నాణ్యత గల వైర్లు వాడాలి. అగ్ని ప్రమాదాలు నివారించడానికి నీటి బకెట్లు, ఇసుక బస్తాలు సిద్ధంగా ఉంచాలి. శబ్ద కాలుష్యం నివారించడానికి కేవలం రెండు స్పీకర్లు మాత్రమే వాడాలి. వృద్ధులు, విద్యార్థులకు ఇబ్బంది కలగకుండా పరిమిత శబ్దంతో పాటలు పెట్టాలి. మండపం వద్ద 24 గంటలు ఒక వాలంటీర్ తప్పనిసరిగా ఉండాలి. కమిటీ సభ్యుల పేర్లు, ఫోన్ నంబర్లు స్పష్టంగా కనిపించేలా ఫ్లెక్సీ ఏర్పాటు చేయాలి. నిమజ్జనం సమయంలో ప్రతి మండపం నుంచి కనీసం ఐదుగురు బాధ్యత గల సభ్యులు ఉండాలి. నిషేధిత కార్యకలాపాలు మండపాల వద్ద మద్యం సేవించడం, పేకాట ఆడటం, లక్కీ డ్రాలు నిర్వహించడం, అసభ్యకర నృత్యాలు చేయడం పూర్తిగా నిషేధం. మత సామరస్యాన్ని దెబ్బతీసేలా ప్రసంగాలు లేదా పాటలు ప్రదర్శించకూడదు. పోలీస్ తనిఖీల కోసం మండపం వద్ద ఒక పాయింట్ పుస్తకం తప్పనిసరిగా ఉంచాలి. అనుమానాస్పద అంశాలపై అప్రమత్తత అనుమానాస్పద బ్యాగులు, వస్తువులు లేదా వ్యక్తులు కనిపిస్తే వెంటనే డయల్ 100 లేదా స్థానిక పోలీస్ స్టేషన్కు సమాచారం ఇవ్వాలి.

గణేష్ నవరాత్రులు శాంతియుతంగా, సురక్షితంగా జరగడానికి అన్ని మండపాల నిర్వాహకులు పోలీసులకు సహకరించాలని కమిషనర్ గౌష్ ఆలం విజ్ఞప్తి చేశారు.

## జాతీయస్థాయి టగ్ ఆఫ్ వార్ పోటీలకు ఉమ్మడి జిల్లా క్రీడాకారులు .



**కరపత్రం ప్రతినిధి కరీంనగర్ ఆగస్టు 21**

మహారాష్ట్ర లోని షిరిడీలో ఈనెల 22 నుండి 25 వరకు జరగబోయే జాతీయ స్థాయి టగ్ ఆఫ్ వార్ పోటీలకు ఉమ్మడి కరీంనగర్ జిల్లా క్రీడాకారులు ఎంపికైనట్లు కరీంనగర్ జిల్లా టగ్ ఆఫ్ వార్ అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు దాసరి శ్రీపాల్ రెడ్డి, కొరిమి సంతోష్ కుమార్, పెద్దపెల్లి జిల్లా టగ్ ఆఫ్ వార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఆలేటి సంపత్ తెలిపారు. కరీంనగర్ నుండి కరీంనగర్ ఉమ్మడి జిల్లా నుండి 15 సంవత్సరాల విభాగంలో ఆర్ ,విష్ణువర్ధన్, ఏ,లక్షిత్ రాజ్, బి, హర్షవర్ధన్,17 సంవత్సరాల విభాగంలో కె, అరవింద్, ఈ, శ్రీధర్, టీ, రిత్విక్, టి, అవినాష్ , జి సుజిత్ కుమార్ , ఎంపిక కాగా పెద్దపెల్లి జిల్లా నుండి 15 సంవత్సరాలు విభాగంలో ఈ, అవినాష్ రావు అండర్ 17 విభాగంలో విశ్వనాథ్ ఎంపికైనారు. వీరి ఎంపిక పట్ల జిల్లా డి వై ఎస్ ఓ శ్రీనివాస్,ఒలంపిక అసోసియేషన్ బాధ్యులు నందెల్లి మహిపాల్, గసిరెడ్డి జనార్దన్ రెడ్డి, తుమ్మల రమేష్ రెడ్డి,మహమ్మద్ కరీం, ప్రైవేట్ పి ఈ టి బాధ్యులు, బత్తిని శ్రీనివాస్ గౌడ్,గౌతమ్,అనూప్, సిహెచ్ మహేందర్, పి ఈ టి నారాయణ ఉమ్మడి టగ్ ఆఫ్ వార్ అసోసియేషన బాధ్యులు హర్షం వ్యక్తం చేశారు.

# ఎలాంటి ముందస్తు నోటీసులు లేకుండా భవనాలను కూల్చివేయడం చట్ట వ్యతిరేకం

- బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు వ్యాళ్ల హరీష్ రెడ్డి

**కరపత్రం ప్రతినిధి గోదావరిఖని ఆగస్టు 21:**

ఎలాంటి ముందస్తు నోటీసులు లేకుండా వ్యాపారులకు సంబంధించిన భారీ షాపింగ్ భవనాలను కూల్చివేయడం చట్ట వ్యతిరేక చర్యలని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు వ్యాళ్ల హరీష్ రెడ్డి తీవ్రంగా మండిపడ్డారు. పెద్దపల్లి జిల్లా గోదావరిఖని పట్టణ చౌరస్తాలో అక్రమ నిర్మాణాల పేరిట గత రెండు రోజుల నుంచి వ్యాపార సంస్థలకు సంబంధించిన బిల్డింగ్ లను రామగుండం కార్పొరేషన్ అధికారులు కూల్చివేస్తున్నారు. కూల్చివేతలు జరుగుతున్న ఈ ప్రాంతాన్ని బీఆర్ఎస్ నాయకులు పరిశీలించి, వ్యాపారులను కలిసి పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన





మాట్లాడుతూ స్థానిక ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ మక్కాన్ సింగ్ అనాలోచిత నిర్ణయం వల్ల వేలాది మంది వ్యాపారులు ఉపాధి కోల్పోతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎలాంటి ముందస్తు సమాచారం లేకుండా భారీ యంత్రాలతో బిల్డింగ్ లను నేలమట్టం చేస్తూ వ్యాపారులను భయభ్రాంతులకు గురి చేస్తున్నాడని అన్నారు. ఎవరైనా అడ్డుపడితే పోలీసులతో భయపెట్టిస్తున్నారని పేర్కొన్నారు. కనీసం వ్యాపారులు తమ సామాగ్రిని తీసుకునే సమయం కూడా ఇవ్వకుండా ఎమ్మెల్యే ఇలాంటి ఆకృత్యాలకు పాల్పడుతున్నాడని చీదరించుకున్నారు. కూల్చివేతలు జరుగుతున్న సమయంలో అందులో ఉన్న సామాగ్రిని తరలించే క్రమంలో వారికి గాయాలైతే, నష్టం జరిగితే ఎవరు బాధ్యులు అని ప్రశ్నించారు. భవిష్యత్తులో ప్రజలు ఇచ్చే తీర్పుతో ఎమ్మెల్యే ఇక్కడి నుంచి వెళ్లే పరిస్థితి ఏర్పడుతుందని హెచ్చరించారు. ఆయన వెంట బీఆర్ఎస్ నాయకులు, వీహెచ్ఆర్ ఫౌండేషన్ సభ్యులు ఉన్నారు.